విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 21 సెప్టెంబరు 2024 8 పేజీలు

ప్రజా సంక్షేమమే...

ప్రభుత్వ ధ్యేయం

- రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం
- జగన్‌రెడ్డివి అన్ని ఫేక్ ప్రచారాలు
- తిరుమల పవిత్రతను కాపాడుతాం
- మంత్రి నారా లోకేష్

ప్రజా సంక్షేమ ప్రభుత్వమే ప్రభుత్వ ధ్యేయమని, రాయలసీమ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండలం ఎన్. కోటూరులో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. గత ప్రభుత్వంలో పరదాలు, బారికేడ్లు పెట్టుకుని తిరిగారు. ప్రజాప్రతినిధులు ఏనాడూ ప్రజలను కలవలేదు. చంద్రబాబు నాయకత్వంలో ప్రజాప్రతినిధులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

- వివరాలు మెయిన్‌లో

ప్రభుత్వ పాఠశాలల్లో ...

మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తాం

- అకనంబట్టు జెడ్పీ హైస్కూల్లో మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర -చిత్తూరు : పూతలపట్టు నియోజకవర్గం అకనంబట్టు జిల్లా పరిషత్ హైస్కూల్ ను రాష్ట్రవిధ్యా, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8,9,10 తరగతి విద్యార్థుల క్లాస్ రూమ్ లను సందర్శించిన మంత్రి లోకేష్ అక్కడి లోటుపాట్లపై విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంకా తమకు టెక్స్ట్ బుక్స్ అందలేదని చెప్పడంతో తక్షణమే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

2

ప్రధానమంత్రి విశ్వ కర్మ పథకం...

ఒక వరం

- చేతివృత్తుల ద్వారానే గ్రామాల సాధికారత

- మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: ప్రధాన మంత్రి విశ్వ కర్మ పథకం కుల వృత్తులు చేసుకునే వారికి ఒక గొప్ప వరం అని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకంను ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తి అయిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఎంఎస్ఎంఈ, న్యాక్, నైపుణ్య అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, స్థానిక తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవుడు ప్రాణం పోసి మనిషిని సృష్టిస్తే.. మనుషులు ఎంతో నైపుణ్యంతో అద్భుతమైన కళాఖండాల్ని తయారు చేసి వాటికి జీవకల ఉట్టిపడేలాగా చేసే సృష్టికర్తలు అని, భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ దేశంలో లక్షల మందికి చేతి వృత్తుల మీద ఆధారపడిన వారికి అండగా నిలిచే ప్రయత్నం ఈ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేశారని,

2

పరిహారం చెల్లించకుంటే భూములను దున్నేస్తాం

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ప్రభుత్వం పరిహారం చెల్లించకుంటే భూములు దున్నే స్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు హెచ్చ రించారు. ఏర్పేడు మండలం పల్లం, పల్లం పేట దళిత, గిరిజనులతో శు క్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా రామానాయుడు మాట్లాడుతూ...

2

తిరుమలలో

సమస్యలపై ప్రశ్నిస్తే

నాపై కేసులు పెట్టారు

- వివరాలు మెయిన్‌లో

2

విశాలాంధ్ర-వెదురుకుప్పం:

దోపిడీ సొమ్ములు రికవరీ చేశారు...బాధితులకు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. సుమారు రెండేళ్లు గా బాధితులు పోలీస్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు. ఖా"కీ"లు కాజేసారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రికవరీ సొమ్ములు.... ఖా'కీ'లు కాజేశారా...?!

సుమారు రెండేళ్లు గా బాధితులు ఎదురుచూపులు - ఉన్నతాధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి

మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తాం

(మొదటి పేజీ తరువాయి) పాఠ్యాంశాలను ఏ లాంగ్వేజ్ లో భోదిస్తున్నారని మంత్రి అడగ్గా..తెలుగు, ఇంగ్లీషు రెండింటిలో చెబుతున్నారని విద్యార్థులు చెప్పారు. స్కూలులో బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చొని చదువుకోవాల్సి వస్తోందని..విద్యార్థులు చెప్పగా, త్వరలో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. టాయిలెట్స్ పరిశుభ్రతపై ఆరా తీయగా, గత మూడు నెలలుగా ఇదివరటికంటే మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. నేను మీ అన్నలాంటి వాన్ని ఎలాంటి సమస్య ఉన్నా నాకు చెప్పండి అని మంత్రి విద్యార్థులకు సూచించారు. ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లను ఉత్తమంగా తీర్చిదిద్ది, దేశంలో ఏపీ మోడల్ అని చెప్పుకునేలా చేస్తామని అన్నారు. యూరప్ వంటి దేశాల్లో మాతృభాషను ప్రోత్సహిస్తున్నారని, మన రాష్ట్రంలో తెలుగు విద్యార్థులు ఇంగ్లీష్ లో చదువుకోవడానికి కొంత ఇబ్బందివడుతున్నారని చెప్పారు. అయితే ఉన్నత చదువులకు వెళ్లాక ఇంగ్లీష్ అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. అన్ని ఆలోచించి ఈ విషయంపై సముచితమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు టీచర్లతో మంత్రి లోకేష్ సమావేశం అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 70 శాతం మాత్రమే ఉండటానికి కారణమేంటని ప్రశ్నించారు. పాఠశాలలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చాల్సి ఉందని టీచర్లు మంత్రికి చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లపై ఇప్పుడిప్పుడే తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని వారు పేర్కొన్నారు. నేను ఎవర్నీ తప్పుబట్టడానికి రాలేదు. పారదర్శకమైన విధానాలతో విద్యాప్రమాణాలను మెరుగు పర్చడమే మా లక్ష్యం. గతంలో ఉపాధ్యాయులకు టాయిలెట్స్ బాధ్యత అప్పగించి తీవ్రంగా అవమానించడం బాధాకరం. ఒక్కసారిగా ప్రభుత్వ స్కూళ్లను మార్చడం సాధ్యమయ్యేది కాదు. మౌలికసదుపాయాలను కల్పించి క్రమేణా విద్యా ప్రమాణాలను మెరుగు పరుస్తాం. వెనుకబడిన విద్యార్థులపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అందరం కలిసికట్టుగా ప్రభుత్వ స్కూళ్లను ఉత్తమంగా తీర్చిదిద్దుదామని అన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత టీచర్లపై ఉందని లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 55 శాతం విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నారని, ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నది 45% మంది మాత్రమే అని చెప్పారు. గతంలో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్ లలో విద్యార్థులు అనవసరమైన కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో టీచర్లు దేగకన్ను వేసి ఉంచాలని సూచించారు. ఇకపై ట్యాబ్స్ కు బదులుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే కంప్యూటర్ ల్యాబ్స్ అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్లోని కొన్ని తరగతి గదులు పెచ్చులూడుతున్నాయని టీచర్లు చెప్పగా, మరమ్మతులు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో వాతావరణం తెలుసుకోవడానికే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాను.. విద్యాశాఖ మంత్రిగా నేర్చుకోవడానికే మీ ముందుకు వచ్చానని చెప్పారు. గతంలో తాను పంచాయతీ రాజ్ మంత్రిగా ఏ నిర్ణయమైనా వెనువెంటనే తీసుకునేవాడినని.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ తో కూడుకున్నందున విద్యాశాఖలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. తరగతి గదుల పరిశీలన అనంతరం విద్యార్థులు, టీచర్లతో లోకేష్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ'లు కాజేశారా...?!

(మొదటి పేజీ తరువాయి) ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.వివరాలలోకి వెళితే...మండలంలోని అయ్యన్నగారిపల్లి కి చెందిన వరదారెడ్డి కి చెందిన జీటి కండ్రిగ పరిధిలో ఉన్న మామిడి తోటలో ఉన్న ఇంటిదగ్గర నాలుగు పొట్టేళ్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసారని 20.12.2022 న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.అయితే అప్పటి ఎస్సై 42/2023 గా కేసు నమోదు చేశారు.అయితే కొద్దికాలానికే ముద్దాయిల నుంచి పొట్టేళ్లు కు బదులుగా 20 వేల రూపాయలు రికవరీ చేసినట్లు సమాచారం.అయితే దోపిడీ సొమ్ములు రికవరీ చేసిన వెంటనే న్యాయస్థానంలో జమ చెయ్యాల్సిఉంది.కానీ సుమారు 28 నెలలు గడుస్తున్నా బాధితులకు న్యాయం చేయకపోవడం వెనుక ఎవరి నిర్లక్ష్యంగా వ్యవహరించారో వారిపై చర్యలు తీసుకోవాలని,రికవరీ చేసిన సొమ్ములు తమకు అందించాలని పోలీసు ఉన్నతాధికారులను బాధితులు కోరుతున్నారు.ఇదే విషయమై కర్వేటినగరం సీఐ హనుమంతప్ప వివరణ కోరగా...42/2023 ఎఫ్ఐఆర్ సంబంధించి పొట్టేళ్ల దోపిడీ కేసులో సొమ్ములు 20 వేలు రికవరీ చేసింది వాస్తవమే.అయితే న్యాయస్థానం లో జమచేసి బాధితులకు అందించడం లో జాప్యం జరిగిందని గుర్తించడం జరిగిందన్నారు.ఈ నిర్లక్ష్యం పై విచారణ చేపడతామని,సొమ్ములు న్యాయస్థానం లో జమచేసి బాధితులకు వెంటనే న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

భూములను దున్నేస్తాం

(మొదటి పేజీ తరువాయి) పల్లం, పల్లంపేట దళితవాడ పేదలకు భూ పరిహారం తక్షణమే చెల్లించకపోతే దళిత, గిరిజనులు భూములు దున్నుకుంటా రన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యం... అధికారుల చేతివాటం కారణంగా పేదలకు అన్యాయం జరిగిందన్నారు. దళిత గిరిజనుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవడంలో వైసీపీ నేతలు, అధికారులు సంపూర్ణంగా ఫలి తాలు పొందారన్నారు. దళిత, గిరిజనుల భూములకు పరిహారం చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన అధికారులపై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని రామానాయుడు డిమాండు చేశారు. పల్లం దళితవాడలో 30 కుటుంబాలకు పైగా సుమారు 45 ఎకరాలకు చెల్లించాల్సిన భూ పరిహారాన్ని చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఇది దళిత గిరిజనులను మోసం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి రైతు దగ్గర డి– నమూనా పట్టా, వన్ –బి పత్రాలు ఉన్నాయని... వీటిని అధికారులు తీసుకొని పేదల దగ్గర సంతకాలు కూడా చేయించుకున్నారన్నారు. అయినా నేటికీ వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ అక్రమంపై ప్రస్తుత ప్రభుత్వమే వెలుగులోకి తీసుకురావాలని రామానాయుడు డిమాండు చేశారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం భూసేకరణలో భాగంగా పొలం దళితవాడకు చెందిన 500 ఎకరాల భూమిని సేకరించారన్నారు. వైసీపీకి చెందిన వారికి ముందస్తుగా డబ్బులు చెల్లించారన్నారు. రెండో, మూడవ దఫా పేరుతో ఇప్పటివరకు కొంతమంది దళిత గిరిజనులకు పరిహారం చెల్లించలేదన్నారు. ఇందుకు బలమైన కారణం వారందరూ టీడీపీ కార్యకర్తలే అన్నారు. ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారిని గుర్తించి కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే భూ పరిహార చెల్లింపులు చెల్లించకుండా అప్పటి నాయకులు దగా చేశారని ఆయన మండిపడ్డారు. ఇపుడు ఏర్పడిన కూటమి ప్రభుత్వం అయినా భూ పరిహార బాధితులను గుర్తించి తక్షణమే పరిహారం చెల్లించి దళిత గిరిజనులను ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు. లేదంటే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎవరి భూముల్లో వారు భూములు దున్నుకోవడానికి సిద్ధపడుతున్నారన్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అండగా ఉండి వారి భూముల్లో వారికి దక్కేలా పోరాటం చేస్తామని రామానాయుడు హెచ్చరించారు. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ... దళిత గిరిజన పేదల భూములకు పరిహారం ఇవ్వనందుకు గాను తిరుపతి కలెక్టరు కార్యాలయం వద్ద గజ్జ గట్టి గొంతెత్తి డప్పు కొట్టి అవినీతి అధికారుల బాగోతాన్ని బట్టబయలు చేస్తామన్నారు. అవినీతిపై పాటలు పాడుతూ ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాళయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి మించల శివకు మార్, స్థానిక నాయకులు రామయ్య, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, సుబ్రహ్మణ్యం, చిన్నమ్మ, రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒక వరం

(మొదటి పేజీ తరువాయి) గ్రామాల సాధికారికతకి చేతివృత్తుల వాళ్లే ప్రధానం అని అన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం మన ఘనమైన వారసత్వ సంపదను పరిరక్షించుకోవడం కోసం వారికి భరోసా ఇచ్చి అండగా నిలబడేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. అద్భుతమైన చెక్కబొమ్మలు, రాతి విగ్రహాలు తయా రు చేసే, ఇత్తడి, ఇనుము విగ్రహం తదితరాలు చేసే 18 రకాల చేతి వృత్తులపై లబ్ధిదారులను గుర్తించి వాటిలో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఆర్థి కంగా తోడ్పాటు అందించి వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అను సంధానం చేస్తున్నామని తెలిపారు..స్థానిక తిరుపతి ఎమ్మెల్యే మాట్లా డుతూ.. చేతివృత్తులు ప్రోత్సహించడానికి ప్రధాని ఈ కార్యక్ర మం రూపొందించడం జరిగిందని అన్నారు. చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయం కూడా ప్రధానమంత్రి చేతుల మీదుగా రెండు లక్షల రూపాయలు ఐదు శాతం వడ్డీకి ఇవ్వడం చాలా సంతోషకర విషయ మని, వడ్డీలకి డబ్బు తీసుకోవడం సంపాదించిన డబ్బులు అంతా వడ్డీలకే కట్టుకోవడం వంటి పరిస్థితులు ఉంటాయని గుర్తించి దాదా పు రెండు లక్షల వరకు తక్కువ వడ్డీకే ఇచ్చి వారి ప్రోత్సహించడం ప్రధానమంత్రి ఔన్నత్యం మనం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విశ్వ కర్మ పథకం కింద చేతి వృత్తులు వనులపై ట్రైనింగ్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇచ్చి తద్వారా వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం 10 బ్యాచులు శిక్షణ జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా డిబిటి పొందిన అమౌంటు రూ. 1,61,49,000, 6998 మంది కి టూల్ కిట్ ఇవ్వడం జరిగింది. బ్యాంకురుణ సౌకర్యం అర్హత కలిగిన టువంటి వారు 852 వారికి రుణ సదుపాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఎం విశ్వ కర్మ, నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకి మంత్రివర్యులు సర్టిఫికెట్స్ అందించారు. యూనియన్ బ్యాంక్ ఎల్డీఎం ద్వారా, పీఎం విశ్వక్ర్మకు సంబంధించి నైపుణ్య శిక్షణ పూర్తయిన తర్వాత 1392 బ్యాంకు అకౌంట్స్‌కు రుణ సౌకర్యానికి చర్యలు చేయడం జరిగింది. అలాగే బ్యాంకుల ద్వారా ఆర్థిక రుణ సహాయం రూ.9 కోట్ల 34 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, స్కిల్ డెవలప్మెంట్ ఏడీజీ ఎన్ఎసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం రాంప్రసాద్, డీసీసీ జీఎం ప్రతాపరెడ్డి, డీఆర్డీఏ పీడీ ప్రభావతి, ఎల్డీఎం విశ్వనాథ్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి..?

– తిరుపతికి ఆజాద్ రాక అనుమానమే



విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బాపిరెడ్డిని నియమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈయన ప్రస్తుతం నెల్లూరు అర్బన్ డెవలప్ మెంటు అథారిటీ (నుడ) వైస్ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. బాపిరెడ్డి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు హోదా కలిగి ఉన్నారు. బాపిరెడ్డి రాకకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కూడా సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాపిరెడ్డి కూడా ముక్కంటి ఆలయ కార్యనిర్వహణాధికారిగా రావడానికి తనవంతు ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది, నుడలో తనకు ఉన్న అనుభవంతో ముక్కంటి ఆలయ బృహత్తర ప్రణాళిక పనులు పరుగులు పెట్టిస్తానని... అదేవిధంగా ఆలయ ఆదాయం గణనీయంగా పెంచడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేస్తానని కూడా ఈయన తెలిపినట్లు సమాచారం. బాపిరెడ్డికి ఈవో అవకాశం దక్కుతుందో...లేదో నేడో రేపో తేలనుంది. కాగా ఇక్కడ ఇన్ ఛార్జిగా ఈవోగా పని చేస్తున్న తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనరు ఎన్ వీఎస్ఎన్ మూర్తిని ద్వారకా తిరుమలలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా నియమించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో తిరుపతి ఆర్జేసీగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ ఈవోగా పని చేస్తున్న ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ను నియమించారు. అయితే తిరుపతి ఆర్జేసీగా చంద్రశేఖర్ ఆజాద్ ను నియమించ వద్దని స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలను కోరినట్లు తెలిసింది. అంతేగాకుండా చంద్రశేఖర్ ఆజాద్ వస్తే తాము సెలవుపై వెళతామని ఆర్జేసీ కార్యాలయ సిబ్బంది పలువురు స్థానిక ప్రజాప్రతినిధి వద్ద చెప్పినట్లు సమాచారం, ఈ పరిణామాల మధ్య చంద్రశేఖర్ ఆజాద్ తిరుపతికి రావడం అనుమానంగా కనిపిస్తోంది. ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి..? తిరుపతికి ఆజాద్ రాక అనుమానమే.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S. No. 203 OF 2016
Between:
P.Munaswamy Reddy and others ...Plaintiffs
And:
V.Jayaram Reddy ...Defendants
NOTICE TO DEFENDANTS 11,13 AND 14
To
D11. V.MANILA,
W/o not known, D/o Ellappa
D13. V.JAYA
W/o not known, D/o Ellappa
D14. V.SELVI
W/o not known, D/o Ellappa
Nos.D11,D13 & 14 are r/at Bangareddipalli Village, Diguvamasapalli Post, Chittoor Mandal & District.
Madam, It is hereby brought to your notice that the above named plaintiff filed a above suit in **O.S.No.203 of 2016** against you and other defendants and same is posted for your appearance. on **14-10-2024**, so that you are hereby ordered to appear before the court on **14-10-2024 at about 10-30 A.M** either in person or through pleader and answer the said suit failing which the amtter will be called and decided esparte.
(B.O)
Sri C.K.RAGHU
Advocate for Plaintiff

శెభాష్... గంటా మోహన్

– మంత్రి నారా లోకేష్ కితాబు

విశాలాంధ్ర–తిరుపతి : "శభాష్ గంటా..నేను ఇప్పటికి ఎనిమిది సార్లే రక్తదానం చేశాను. మీరు వందోసారి చేస్తున్నా రంటే గ్రేట్. కంగ్రాట్స్ " అంటూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం, ప్రభుత్వ ఆసుపత్రిలో 100 వ సారి రక్తదానం చేస్తున్న ఎస్టీయూ రాష్ట్ర నేత గంటా మోహన్ ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు అభినందించారు. మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో గంటా మోహన్ రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. ఈ సందర్భంగా "మీ స్వస్థలం ఎక్కడ..? ఎక్కడ పని చేస్తున్నారు..? అని గంటా మోహన్ ను లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈయన మంచి నాయకుడని నారా లోకేష్ కు ఎమ్మెల్యే మురళీ మోహన్ పరిచయం చేశారు. ఈ క్రమంలో అక్కడి అధికారి ఒకరు... గంటా మోహన్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నేత అని ప్రస్తావించగా... లోకేష్ నవ్వుతూ.. విద్యాశాఖలో అంతా గందరగోళంగా వుందని... అన్నీ సర్దుతామని అన్నారు. మీ ఆధ్వర్యంలో సమస్యలు అన్నీ పరిష్కారం అవుతాయనే నమ్మకం ఉందని గంటా మోహన్ పేర్కొనగా.. లోకేష్ చిరునవ్వుతో కరచాలనం చేశారు. అనంతరం చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ , "హాయ్ గంటా.. కీప్ ఇట్ అప్..కంగ్రాట్స్ ". గంటా మోహన్ ను ప్రత్యేకంగా అభినందించారు.

వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం "మున్సిపల్ కార్యాలయం ముట్టడి"

విశాలాంధ్ర- తిరుపతి : వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 23 సోమవారం నాడు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వీధి వ్యాపారులందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఏఐటియుసి కార్యాలయం నందు మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.రాధాకృష్ణ చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ తిరుపతి నగరంలో అనేక చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ జీవనం పొందుతున్న వారందరికీ కేంద్ర ప్రభుత్వం అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు ఏర్పాటు చేసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించినప్పటికీ తిరుపతి నగరంలో మునిసిపల్ అధికారులు ఆ ప్రయత్నం చేయకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు.వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా వీధి వ్యాపారులందరిని గుర్తించి వాళ్ళందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అక్రమంగా నగరం మొత్తం గేట్ పేరుతో వసూలు చేస్తున్న అక్రమ గేట్ వసూళ్ల దందాపై కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల ట్రాఫిక్ , స్థానిక పోలీసు వారు రెక్కాడితే గాని డొక్కాడని వీధి వ్యాపారులపై పెట్టీ కేసులు బనాయించడం మాను కోవాలి విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రా ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటియు సి జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ ఎన్ శ్రీరాములు, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు యన్.డి.రవి కే.వై రాజా, వీధి వ్యాపారుల సంఘం నాయకులు ఎం శ్రీనివాసులు, సుధాకర్, భాష, పెంచలమ్మ, కాంచనమ్మ, రూప, గురవయ్య , అశోక్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజును కలసిన తెలుగు యువత అధ్యక్షుడు

విశాలాంధ్ర - పుంగనూరు : పుంగనూరు టీడీపీ నాయకులు రాజాం పేట పార్లమెంటు తెలుగు యువత ఉపా అధ్యక్షుడు కె.సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో శుక్రవారం రోజునతెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చామంతి జగన్మోహన్ రాజు ని రాజాం పేట పార్లమెంట్ కార్యలయం నందు మర్యాద పూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్బంగా పార్లమెంట్ అధ్యక్షుడు చామంతి జగన్మోహన్ రాజు మాట్లాడుతు పుంగనూరు నియోజకవర్గం లో టిడిపి పార్టీ గెలుపుకు కృషి చేసి ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేస్తున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడానికి నాయకులు, కార్యకర్తలు అందరు కలసి కట్టుగా పనిచేయాలని రానున్న రోజుల్లో టీడీపీ పార్టీ కి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు.టిడిపి పార్టీ అధికారం లోకి రావడానికి రాజు క్షత్రియులు అందరు కలసి అండగా నిలిచారాని పార్టీ కార్యక్రమలలో చురుకుగా పాల్గొంటూ అభిమానం చూపరని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే.లక్ష్మణ రాజు ఎక్స్ టిడిపి కౌన్సిలర్,కే.జ్యోతి రాజు,కే.వరదరా రాజు,కే. విజయ భాస్కర్ రాజు మరియు ఎం.సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి

– బీసీవై పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర -పుంగనూరు:-బీసీవై పార్టీ అధ్యక్షులు బి రామచంద్ర యాదవ్ శుక్రవారం రోజున తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న హిందువుల అతి పవిత్రమైన దేవాలయం అంటే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎక్కడ వెల్లిన చెప్పడం జరుగుతుందన్నారు అలాంటి ఆలయంలో స్వామివారి లడ్డులో జంతువులకు సంబంధించిన కొవ్వు చేపల సంబంధించిన నూనె వేసి వైయస్సార్ పార్టీ పాలనలో ఆ స్వామి వారిని అపవిత్రం చేయడం జరిగిందన్నారు దీనితో యావత్తు హిందూ సమాజం మనోభావాలు దెబ్బతినడం జరిగిందన్నారు టిటిడి ఈవోగా ధర్మారెడ్డిని పెట్టుకుని వైసిపి ప్రభుత్వ పెద్దల కనుసనల్లో పనిచేసిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి అవినీతికి పాల్పడి స్వామివారికి చెందిన కోట్ల రూపాయల విరాళాలను దోచుకోవడం దాచుకోవడం జరిగిందన్నారు ఇది చాలదన్నట్లు స్వామి వారి ప్రసాదం తయారు చేసే లడ్డు కేసే నెయ్యి గత ఎన్నో ఏళ్లుగా ఎవరు అధికారంలో ఉన్న నంది నెయ్యి టీడీడీకి సప్లై చేసే వారిని కానీ ఈ వైయస్సార్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కాంట్రాక్టు రద్దుచేసి తమకు ముడుపులు ఇచ్చే వారిని ఏర్పాటు చేసుకొని తద్వారా ఈ ఘాతుకానికి పాల్పడడం జరిగిందన్నారు ఇటువంటి వారిని ఏమి చేసినా తప్పు లేదని యావత్ ధర్మ సమాజం ప్రపంచమంతా కోరుకుంటున్నారు దీనిపైన ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని వారిని శిక్షించాలని కోరుతున్నామన్నారు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పైలు కాల్చివేసిన కేసుని లాలూచీపడి కేసుని ఎఫ్ఐఆర్ కూడా వేయకుండా నీరు గార్చారు ఆ విధంగా ఈ కేసులో లాలూచీ పెడితే మాత్రం బీసీవై పార్టీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని పోరాటం చేయడం జరుగుతుందని హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వం నీ సిగ్గుగా టీడీడీ భక్తుల మనోభావాలను కాపాడడం కోసం కృషి చేయాలని కోరుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ నాయకులు సాంబమూర్తి రమేష్ హరినాథ్ రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తాం

– జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర- తిరుపతి : ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 85 ను వెం టనే రద్దు చేయాలని కోరుతూఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్.చత్రప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా వైదారిక కేంద్రం నందు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్.చత్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రదర్శించడం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నీ ట్, పీజీ కౌన్సిలింగ్ లో గతంలో 30% మార్కులు వేసే విధంగా ఉండేదని, జీవో నెంబర్ 85 తో 15 శాతానికి పరిమిత మవుతున్నదని వివరించారు. వెంటనే ఈ జీవోను రద్దుచేసి గతంలో లాగానే పీజీ కౌన్సిలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే ఆరేండ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ సివిల్ సర్జనులుగా, 12 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జనులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కల్పించేందుకు 104 సర్వీస్ ద్వారా వైద్యం అందించడం జరుగుతుందని అక్కడ పనిచేసేటువంటి వైద్యుల కు అలవెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలు పేరుతొ కాలయాపనం చేయకుండా సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము శాంతియు తంగా ఆందో ళన చేస్తూ ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సిఎస్ఆర్ఎమ్ఓ. డాక్టర్ హరికృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్. కృష్ణ చైతన్య, కోశాధికారి. డాక్టర్ వికాస్, సభ్యులు డాక్టర్ .కళ్యాణ్ రెడ్డి, డాక్టర్ పవిత్ర, డాక్టర్ లి నా కుమారి, డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్. తేజస్విని. వైద్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి. డాక్టర్ శ్రీహరికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ డాక్టర్లు యొక్క డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లేందుకు తాను కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం మండలం డిఎం పురం గ్రామానికి చెందిన నాగేశ్వర్ పుట్టినరోజు సందర్భంగా తండ్రి భీమారావు తల్లి లోకేశ్వరి కార్వేటినగరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు ప్రతి ఏడాది ఇదే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురవమ్మ, సుబ్రహ్మణ్యం,ముని లక్ష్మి నారాయణ, వృద్ధాశ్రమంలో పర్యవేక్షకులు ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శుక్రవారం స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రారంభించారు. మొదట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఉన్న అన్నా క్యాంటీను ప్రారంభించారు. ఆ తరువాత స్వర్ణముఖినది ఒడ్డున రామసేతు పక్కన మరో అన్నా క్యాంటీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ... తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ అన్నా క్యాంటీన్లు ప్రారంభించామని తెలిపారు. ఈ క్యాంటీన్లలో రూ.5లకే నాణ్యమైన భోజనం దొరుకుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి ,టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, గుమ్మడిపూడి దశరధా చారి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగనేని చెంచయ్య నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి షాకీర్ అలీ , మాజీ కౌన్సిలర్లు నాగమల్లి దుర్గాప్రసాద్, సుప్రజ, లక్కమనేని మధుబాబు,టిడిపి నాయకులు, బీజేపీ నేతలు , జనసేన నాయకులు, ప్రభుత్వ అధికారులు , తదితరులు,పాల్గొన్నారు.

రుయా హాస్పిటల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం

విశాలాంధ్ర- తిరుపతి : రుయా హాస్పిటల్ నందు శుక్రవారం డ్రై"డే ఫ్రైడే, కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని రుయా హాస్పిటల్ హెల్త్ సూపర్వైజర్ కే.ఆర్. ప్రకాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. హాస్పిటల్ నందు మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు పిచికారి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని తెలియజేశారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల దోమలు ఈగలు వాలుతాయన్నారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేస్ట్ కంట్రోల్ సిబ్బంది, ఏ. వన్ .సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :- కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులైన సందర్భంగా శుక్రవారం ప్రారంభించిన ' ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. మండల ఇంచార్జ్ ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో సత్య వేడు నియోజకవర్గం లో కంచన పుత్తూరు, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ, 100 రోజుల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు, ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు చేసింది ప్రజల్లో తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు, మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2024 జూన్ 12న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి సెప్టెంబర్ 20కి 100 రోజులు అవుతోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు, కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వముగా ప్రజల్లోకి చొచ్చికిపోయిందన్నారు, భవిష్యత్ కాలంలో ఈ ప్రభుత్వం అనేకమైన సంక్షేమ పథకాల అమలు చేయడంలో ముందు వరుసలో నిలుస్తుందన్నారు. సంక్షోభంలో కూడా సంక్షేమ పథకాల అమలుపరిచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కంచన పుత్తూరు సర్పంచ్ స్వప్న, తెలుగుదేశం పార్టీ నాయకుడు సముద్రాల గోపి నాయుడు, బాబు నాయుడు, మాజీ సర్పంచ్ గల్లా నాగేశ్వరరావు (చిన్న రావు) ఆయా గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. సచివాల యం సిబ్బంది వెంకటసుబ్బయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయ శ్రీ, రేవతి పాల్గొన్నారు.

విద్యార్థులలో విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం కూడా అవసరం

విశాలాంధ్ర-కార్వేటినగరం: ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద విద్యార్థుల పటన విధానాన్ని ప్రతిరోజు పరిశీలన చేయవలెనని ఆర్కే ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వరూప తెలిపారు. శుక్రవారం ఉదయం కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థుల హాజరు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. విద్యార్థులు సెల్ఫోన్లు కళాశాలకు తీసుకురాకుండా తల్లిదండ్రులు కట్టడి చేయాలన్నారు. ఉపన్యాసకులు విద్యార్థుల హాజరు మొదటి రెండవ నేను టెస్ట్ ఫలితాలపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ విధమైన ఆత్మీయ సమావేశం నిర్వహణ పట్ల పలువురు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తల్లిదండ్రులు అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.వో సనత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పోటీలు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులుక్రీడాస్ఫూర్తితో మెలగాలని పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ ఖోఖో బ్యాడ్మింటన్ యోగా చెస్ అథ్లెటిక్ క్రీడలకు సంబంధించి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినక్రీడాకారులను నియోజకవర్గ క్రీడలకు ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల పిడిలు, పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: రాష్ట్రంలో ఎన్.డి. ఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయింది. ప్రతి ఇంటికి ప్రభుత్వ విజయాలు చేరాలి అనే ఉద్దేశ్యంతో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. గూడూరు రూరల్ పరిధిలోని తిప్పారప్పాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఎం.పి.డి.వో వెంకటేశ్వర రావు, స్థానిక టీడీపీ నాయకులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా డిఎస్సీ నోటిఫికేషన్ ను విడుదల చేసింది అన్నారు. అదేవిధంగా పెన్షన్‌ను పెంచడం జరిగింద న్నారు. అదేవిదంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించారు అన్నారు. రాష్ట్రంలో 5 రూపాయ లతో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభిం చడం జరిగిందన్నారు. విజయవాడ వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచింది అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు దుద్దా రాఘవ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖబడ్దార్.. తప్పు చేస్తే ఎవరి తాటైనా తీయడానికి ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ లోని తారకరామనగర్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను తీసుకునేలాగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ల్యాండ్ యాక్ట్‌ను రద్దు చేశామని తెలియజేశారు. బొజ్జల సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వమని పేద వాళ్ళ జీవితంలో మార్పు వచ్చేలా ఒక అన్న లాగా తమ్ముల్లాగా నేను ఉన్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారని కొనియాడారు. ఈ 100 రోజుల పాలనలో శ్రీకాళహస్తి బ్రహ్మాండంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పారు. ప్రతి మండలానికి రెండు కోట్ల రూపాయలు డ్రైనేజీకి మరియు సిసి రోడ్లకి తీసుకొచ్చామని, రూ.32 లక్షల సొంత నిధులతో మూడు బీసీ హాస్టళ్లను ఒక ఆహ్లాదకరమైన వాతావరణంతో రూపుదిద్దామని, రేణిగుంటలో ఎక్కడెక్కడ ప్లాట్లు కబ్జాకు గురయినాయో ఒక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రూ.16,500 కోట్లు పెట్టి మెగాడిఎస్సి ఇవ్వడం జరిగిందని, ప్రతి ఇంటికి మొదటి తేదీనే పెన్షన్ ఇస్తున్నామని, గత ప్రభుత్వంలో రేణిగుంటలోని పాంచాలి నగర్‌లో ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా మూడంతస్తుల భవనాన్ని వైసిపి నాయకులు నిర్మించారని ఆ స్థలాన్ని ఇప్పుడు పూర్తిగా సర్వే చేయించి పోలీస్ వారికి పోలీస్ స్టేషన్ కొరకు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రేణిగుంట మరియు ఏర్పేడులలో వచ్చే ఆరు నెలల లోపు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5 లకు ప్రతి పేదవానికి అన్నం దొరికే లాగా ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవోపీఆర్డీ రత్నమ్మ, టిడిపి నాయకులు బుచ్చినాయుడు, రాజేంద్ర, కృష్ణమూర్తి, శ్రీను, వెంకటరత్నం, డిబి నాదం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వందరోజుల పాలన అభినందనీయం

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: దాదాపు అర్థ శతాబ్ద కాలంగా తలపండిన నేతగా రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా పరితపించే నాయకుడు చంద్రబాబు అని టీడీపీ బీసీ సెల్ నాయకులు రుద్ర కోటి సదాశివం తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం స్థానిక టీడీపీ నేతలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రిగా 100 రోజులు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత ఐదు ఏళ్లు బీసీలు నరకాన్ని అనుభవించారన్నారు. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీసీలకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన వైసీపీ పోలేదని దుయ్యబట్టారు. కూటమి పాలనలతో బీసీలకు ఇక స్వర్ణ యుగమే అన్నారు. బీసీలకు ఎన్టీఆర్ ఉన్నత విద్య, విదేశీ విద్య తోపాటు ఎన్నో సంక్షేమ పథకాలు (ఎన్డీఏ) కూటమి పాలనతో నెరవేరుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వనాథ్, అశోక్, సత్యవతి, రాములు, ఆముదాల తులసి రామ్, తంజావూరు రామయ్య పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తి పెంపునకు ఆరోగ్యకరమైన ఆహారం అవసరం

విశాలాంధ్ర-సత్యవేడు: ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సత్యవేడు స్త్రీశిశు సంక్షేమ అధికారిని దేవకుమారి చెప్పారు. శుక్రవారం సత్యవేడు పట్టణంలోని దలవాయి అగ్రహారం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త అనురాధ ఆధ్వర్యంలో పోషక ఆహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారిని దేవకుమారి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల ఎముకలు బలోపేతం అవుతుందన్నారు. ప్రధానంగా ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్స్ వంటి సూక్ష్మ పోషకాలు సమతుల్య ఆహారంలో భాగమే అన్నారు. ఓట్స్, బ్రౌన్ రైస్, గింజలు, విత్తనాలు వంటి ఫైబర్ ఉన్న ఆహారాలను గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తదనంతరం పోషక ఆహారానికి సంబంధించి పండ్లు, ఆకుకూర, చిరుధాన్యాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేంద్ర, అంగన్వాడీ కార్యకర్తలు కాంతమ్మ, భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం లతాదేవి, ఎంఎల్ హెచ్పి సుమ, ఆశ వర్కర్లు విద్య, జయశీల, పలువురు గర్భవతులు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

లడ్డు కల్తీలో దోషులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు నూనెను నెయ్యిలో కల్తీ చేసిన విషయంలో ప్రధాన సూత్రధారులు, దోషులు ఎవరో కనిపెట్టి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు మాట్లాడుతూ తమిళనాడు, దిండిగల్‌కు చెందిన ఫుడ్ పరిశ్రమ నుంచి కల్తీ నెయ్యి తిరుమలకు సరఫరా చేసినట్లు తెలిసిందన్నారు. గత రెండు నెలల క్రితం తెలిసినా ఆ సంస్థను బ్లాక్లిస్టులో పెట్టారేగాని, ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ గూడుపుఠాణి వెనుక ఉన్న గుంటనక్కలను ఎందుకు కాపాడుతున్నారో తెలియట్లేదన్నారు. ఇందులో పాత్రధారులు, సూత్రధారులు అందరూ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. దొడ్డా రెడ్డి రాంభూపాల్ రెడ్డి, వెంకట నరసింహులు, చిట్టిబాబు, నరేంద్రబాబు, సుప్రజ, లోకేష్ రెడ్డి, కలిందర్, గోపి తదితరులు డిమాండ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న తమిళ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని అక్కంపేట గ్రామం నుండి అక్రమంగా రెండు లారీల్లో తరలిస్తున్న తమిళ రేషన్ బియ్యాన్ని గురువారం తడ పోలీసులు పట్టుకున్నారు. తడ ఎస్సై కొండప్ప నాయుడు సమాచారం మేరకు అక్కంపేట ప్రియదర్శిని కాలేజీ సమీపం నుండి రెండు లారీలలో అక్రమంగా తమిళ రేషన్ బియ్యం తరలిస్తున్నారు అంటూ సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో సివిల్ సప్లై డీ టీ ఒబయ్య సహకారం తో అక్కంపెట నుండి జాతీయ రహదారి వైపు వస్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా ఒకలారిలో 30టన్నులు మరో లారీలో 12 టన్నుల తమిళ రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించి లారీ డ్రైవర్లు చంద్రశేఖర్ దుర్గారెడ్డి లను అదుపులో తీసుకున్నామని లారిలోని 42 టన్నుల తమిళ రేషన్ బియ్యం విలువ సుమారు రూ.12,58,500 వుంటుందని, పట్టుబడ్డ 2 లారీలను తడ పోలీస్ స్టేషన్‌కు తరలించి లారీ ఓనర్ వెంకటరెడ్డి రేషన్ బియ్యం వ్యాపారం చేసే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సత్యవేడులో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర-సత్యవేడు: రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం కొలువు తీరి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగం గా శుక్రవారం సత్యవేడు పట్టణం లో మూడవ సచివాలయ పరిధిలో కుమ్మరిగుంట, పాపానాయుడు వీధి, అలాస్వామి వీధి తదితర ప్రాంతాల్లో టిడిపి నాయకులు మురళి (చికెన్ చిన్న), శంకరయ్య, షణ్ముగం తదితరులు సచివాలయ సిబ్బంది నవీన్, ప్రకాష్, త్యాగరాజతో కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి వంటి వాటిపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు స్టిక్కర్స్ ఇచ్చి వివరిస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు మురళి మాట్లాడుతూ సెప్టెంబర్ 20 నుంచి 26 వరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన కొనియాడారు. ముఖ్యంగా సామాజిక భద్రత సొమ్ము పెంపు, ప్రమాదకరంగా మారిన ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు, మెగా డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన చెప్పుకోదగ్గవి అన్నారు.

పితృపక్షం అన్నదానంలో పాల్గొన్న తిరుపతి మేయర్ శిరీష

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: తిరుచానూరు యోగిమల్లవరం లోని శ్రీసాలగ్రామ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన పితృపక్ష అన్నదానం నాల్గవ రోజు కార్యక్రమంలో తిరుపతి మేయర్ శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు 16 రోజుల పాటు నారద పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పితృపక్షం అన్నదానంలో పాల్గొనడం ఆనందంగా ఉందని మేయర్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ భాద్రపద పూర్ణిమ నుంచి అమావాస్య వరకు మొదటి రోజు నుంచి చివరి రోజు వరకూ 16 రోజులు పితృ దేవతలను తృప్తి పరచే పనులు చేయటం ద్వారా పితృ ఋణం తీర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. నారదపీఠం అన్నదాన సమాజం ఆధ్వర్యంలో 16రోజులు రుచికరమైన భోజనాన్ని అందించటం వల్ల ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్న వారికి వారి వారి పితృదేవతల ఆశీస్సులు అందుతాయన్నారు. పితృ దేవతల అనుగ్రహంతో ఎంతో కాలంగా తీరని కోరికలు ఉంటే కూడా నెరవేరతాయని, శ్రేయస్సు పొందగలుగు తారన్నారు. స్వయంగా ఆమె పలువురికి అన్నం వడ్డించారు. తిరుచానూరు, యోగిమల్లవరం నుంచి వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చక స్వాములు వేద ఆశీర్వచనం చేసి, మూలమూర్తి శేషవస్త్రం ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో నారదపీఠం వ్యవస్థాపకులు దినేష్ స్వామి, శ్రీ సాలగ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ మండలి సభ్యులు డాక్టర్ వేణుగోపాల్, మేడసాని సురేందర్ నాయుడు, రూపేష్, దీప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడ్డ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన ఊరగాయల చంద్రశేఖర్ రెడ్డి(45) సోమవారం ఆటో నుంచి జారి పడటంతో తీవ్ర రక్త గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ ప్రైవేట్ లాడ్జ్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి సోమవారం విధులు ముగించుకుని తిరుపతి నుండి మల్లయ్య పల్లెకు ఆటోలో తిరుగు ప్రయాణమయ్యాడు. చంద్రగిరి హీరా కాలేజీ సమీపంలో ఆటోలో వెనక కూర్చొని ప్రయాణిస్తూ చంద్రశేఖర్ రెడ్డి కాలుజారి పడటంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు అదేరోజు తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఉదయం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఓపెన్ స్కూల్ నందు 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశము కోసం ఆన్ లైన్‌లో చేసుకునే దరఖాస్తులకు గడువు ఈనెల28వ తేదీ వరకు 200 రూపాయల అపరాధ రుసుముతో పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, ఓపెన్ స్కూల్ తిరుపతి జిల్లా కో-ఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజును 30వ తేదీ వరకు ఏపీ ఆన్ లైన్ ద్వారా చెల్లించవచ్చునని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు ఈ విషయాన్ని విరివిగా ప్రచారం చేయాలని కోరారు.గత సంవత్సరం కంటే కూడా ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకునే దానికి చైతన్య పరచాలని తెలియపరిచారు. అదేవిధంగా అధ్యయన కేంద్రాల పరిధిలోని డ్రాపోట్స్‌ను కూడా దరఖాస్తు చేసుకునేటట్లు చూడాల్సిన అవసరం ఉందన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామీణ విద్యార్థులు మండల స్థాయి క్రీడలలో పాల్గొనాలని ఎంఈఓలు కే.రవీంద్రనాథ్, ఆవల మునిసుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడికి రమణయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఎంపిక జరిగినది. ఈ క్రీడా పోటీలలో నెలవాయి కళ్ళు పెట్టి ఉన్నత పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెయ్యి నాణ్యతలో రాజీ లేదు

- మేము స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ఉపయోగించి లడ్డూల ప్రసాదాల పవిత్రతను నిర్ధారిస్తాము
- టీటీడీ ఈవో జె శ్యామల రావు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ఉపయోగించి శ్రీవేంకటేశ్వర స్వామికి అత్యధికంగా సమర్పించే లడ్డూ ప్రసాదాల పవిత్రతను టీటీడీ నిర్ధారిస్తుంది అని టీటీడీ ఈవో జె శ్యామలరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు తిరుమల ఆలయాన్ని సందర్శిస్తుండటంతో లడ్డూలను తయారు చేసేందుకు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడంతోపాటు తిరుమల దివ్యక్షేత్రం, లడ్డూ ప్రసాదాల పవిత్రతను, దైవత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లోని మీటింగ్ హాల్‌లో మీడియా ప్రతినిధులతో ఈఓ మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో నాణ్యత, రుచి ఉండేలా చూడాలని, పవిత్రతను పునరుద్ధరించాలని ఏపీ సీఎం నారా చంద్ర బాబు నాయుడు స్పష్టంగా చెప్పారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ఉపయోగించడం వల్ల ఇది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మరియు మిలియన్ల మంది భక్తుల మనోభావాలను కలిగి ఉంటుంది. దీనిని అనుసరించి, కొత్త టిటిడి అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి మేము లడ్డూల నాణ్యత మరియు రుచిని మెరుగుపరచడంపై దృష్టి పెట్టడం ప్రారంభించాము. గత కొన్ని సంవత్సరాలుగా లడ్డూల నాణ్యత తక్కువగా ఉందని యాత్రికుల నుండి అభిప్రాయాన్ని స్వీకరించిన తరువాత మరియు పోటు కార్మికులతో (లడ్డూ తయారీదారులు) సంభాషించిన తరువాత, మొదటిసారిగా టీటీడీ కల్తీ పరీక్ష కోసం బయటి ల్యాబ్‌కు నెయ్యి సరఫరాలను పంపింది. టిటిడికి 5 నెయ్యి సరఫరాదారులు ఉన్నారు మరియు ధరలు రూ. 320 నుండి రూ. 411 మధ్య ఉన్నాయి. పేర్లు ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, కృపరామ్ డైరీ, వైష్ణవి, శ్రీ పరాగ్ మిల్క్ మరియు ఏఆర్ డెయిరీ. ప్రాథమికంగా ఈ రేట్లు స్వచ్ఛమైన నెయ్యిని సరఫరా చేయడానికి ఆచరణీయమైన రేట్లు కాదు. మంచి నాణ్యమైన నెయ్యిని నిర్ధారించాలని కొత్త అడ్మినిస్ట్రేషన్ అందరినీ హెచ్చరించింది, లేకపోతే కల్తీ కోసం పరీక్షించడానికి నమూనాలను బయటి ల్యాబ్‌లకు పంపబడుతుంది మరియు పాజిటివ్ అని తేలితే బ్లాక్‌లిస్ట్ చేయబడుతుంది. హెచ్చరిక తర్వాత కూడా, ఏఆర్ ఫుడ్స్ పంపిన 4 నెయ్యి ట్యాంకర్లు నాణ్యత లేనివిగా ప్రాథమికంగా గుర్తించబడ్డాయి. ప్రఖ్యాత ఎన్‌డిడిబిసిఏఎల్ఎఫ్ ఆనంద్‌కు పంపిన నమూనాపై ఎస్-విలువ విశ్లేషణ నిర్వహించ బడింది, ఇది ప్రామాణిక పరిమితులకు వెలుపల పడిపోయింది, సోయా బీన్, పొద్దుతిరుగుడు, తాటి కెర్నల్ కొవ్వు లేదా పందికొవ్వు మరియు బీఫ్ టాలో వంటి విదేశీ కొవ్వుల ఉనికిని సూచిస్తుంది. స్వచ్ఛమైన పాల కొవ్వుకు ఆమోదయోగ్యమైన ఎస్-విలువ పరిధి 98.05 మరియు 104.32 మధ్య ఉంటుంది, అయితే పరీక్షించిన నమూనా 23.22 మరియు 116 నుండి గణనీయ వ్యత్యాసాలను ప్రతిబింబిస్తూ విలువలను చూపింది. ఇప్పుడు ఇంటింటా ల్యాబ్ లేకపోవడమే నాణ్యత లోపానికి కారణం. సరఫరాదారులు ఈ లోపాలను సద్వినియోగం చేసుకున్నారు. ఎన్‌డిడిబి నెయ్యి కల్తీ పరీక్ష పరికరాలను విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చింది, దీని ఖరీదు రూ. 75 లక్షల పరికరాలు, శాశ్వత పరిష్కారంగా వచ్చే డిసెంబర్ లేదా జనవరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి కూడా పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం... పేదల ప్రభుత్వం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా ప్రభుత్వ విజయాలను ప్రతి ఒక్కరికీ చెర వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సి.ఎం చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల హామీల లో భాగంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు నిరుద్యోగ సమస్యను అరికట్టే చర్యల్లో భాగంగా మెగా డీఎస్సీ పెంచిన పింఛన్లు ప్రతినెల ఒకటవ తారీఖునే ప్రభుత్వ ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వడం ఐదు రూపాయలకే భోజనం అందించడం అన్నా క్యాంటీన్లు నెలకొల్పడం జరిగిందన్నారు. ముఖ్యంగా రైతులకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం ప్రజల ఆస్తులకు భద్రత కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యారమాపు హేమంత్ కుమార్ రెడ్డి, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, ముప్పాల గిరి రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అంకమ్మ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-వి.కోట: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్, కోర్ వాలంటరీ ఆర్గనైజేషన్ల సహకారంతో "మీకు తెలుసా?" అనే పేరుతో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధులు ఎలా వస్తాయి. దాని నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైరస్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే విషయాన్ని వివరించారు. ఎయిడ్స్‌పై సాధారణ అపోహలు మరియు ఇన్ఫెక్షన్లను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్ బారిన పడిన వారి పట్ల సమాజంలో వివక్ష లేకుండా జీవించడం యొక్క ప్రాముఖ్యతను వివరించడం తెలిపారు. అలాగే క్షయవ్యాధి (టీబీ), చికిత్స ఎంపికల యొక్క ప్రాముఖ్యత, వ్యాధుల నివారణలో కండోమ్‌లు పోషించే కీలక పాత్ర గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధి హుసేన్, సభ్యులు రమాదేవి, పద్మావతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడడం వెంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయడమే

విశాలాంధ్ర-సత్యవేడు: లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడడం కలియుగ శ్రీవెంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీయడమేనని తెలుగు యువత తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి తులసి రామ్ అన్నారు. తిరుమల లడ్డు తయారీలో జంతువుల కొవ్వు కలిసిన కల్తి నెయ్యి వాడుతున్నట్టు ప్రయోగశాల రిపోర్టు బట్టబయలు అయిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు.కలియుగ శ్రీవెంకటేశ్వర స్వామి దర్శించుకునే భక్తులు స్వామివారి ప్రసాదాన్ని దైవంగా భావిస్తారన్నారు. అందుకనే స్వామి దర్శనానంతరం ప్రతి భక్తుడు లడ్డులను కొనుగోలు చేయకుండా ఇంటికి తిరిగి రారన్నారు. ఇంతటి పవిత్రత కలిగిన శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో జంతు కొవ్వు ఉన్నట్లు టిటిడి జరిపిన ప్రయోగశాల రిపోర్టులో రావడం భక్తులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డు తయారీలో జంతు కొవ్వు కలిసిన నెయ్యిను వాడడం చరిత్రలోనే ఇది తొలిసారి అన్నారు. దీనివల్ల కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం లేకపోలేదు అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పూర్తిగా విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటివి మళ్లీ పునరావతం కాకుండా తిరుమలలోనే ఒక ప్రయోగశాలను కూడా ఏర్పాటు చేయాలి అన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-వి.కోట: మండలంలో శనివారం స్థానిక శాసన సభ్యులు ఎన్. అమర్నాథ్ రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ రఫీ తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం లో భాగంగా కుంభార్లపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయాలలో జరిగే కార్యక్రమాలకు హాజరౌతారు. కార్యక్రమంలో భాగంగా ముమ్మిడేర్లపల్లి, బాలేంద్ర పల్లి, కుంభార్లపల్లి, గెస్తింపల్లి, అనంతపురం, గ్రామాల్లో పర్యటించనున్నారన్నారు.

తిరుమల లడ్డు కల్తీ బాధగా ఉంది

ప్రవాసీయుడు డాక్టర్ ముక్కు తులసి కుమార్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి లడ్డు కల్తీ చేయడం బాధగా ఉందని ప్రవాసీయుడు డాక్టర్ ముక్కు తులసి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శు క్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలియుగ వైకుంఠవాసున్ని చూడడానికి ప్రపంచ నలుమూలలనుండి వస్తుంటార న్నారు. తిరుమలలో వెలసిన వెంకటేశ్వరస్వామికి ప్రపంచం అంతా భక్తులున్నారన్నారు. రెండు రోజుల నుంచి మీడియాలో, సోషల్ మీడియాలో తిరుపతి లడ్డులో కల్తీ నెయ్యి విషయం ప్రపంచ భక్త జనాన్ని నివ్వెర పోయేటట్లు చేసిందన్నారు. రెండు రోజుల నుంచి విదేశాలలో ఉన్న భారత దేశానికీ చెందిన అనేక మంది భక్తులు ఈ కల్తీ లడ్డు విషయాన్ని అడుగుతున్నారని... ఏమి చెప్పాలో అర్థం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు దయవల్ల ప్రతినెలా తిరుమల నుండి వచ్చే వెంకటేశ్వర స్వామి లడ్డు దుబాయ్ ప్రాంతంలో అనేక మంది భక్తులకి ఉచితంగా పంపిణీ చేస్తుంటానని అందరూ సంతోషంగా స్వీకరిం చేవారన్నారు. ఇప్పుడు పదే పదే కల్తీ విషయం అడగడం వలన ఏమి చెప్పాలో అర్థం కాలేదన్నారు. భక్తుల మనోబావాన్ని, నమ్మకాన్ని వమ్ము చేసిన వారిని వేంకటేశ్వరుడు కఠినంగా శిక్షిస్తాడన్నారు. తప్పు చేసినవారిని ఉపేక్షించొద్దు అని ముక్కు తులసి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

తొండమానుపురంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బిజెపి అసెంబ్లీ కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో నాల్గవరోజు తొండమానుపురంలో వృద్ధుల సంక్షేమ కేంద్రం నందు వృద్ధులకు చీరజాకెట్స్, పంచేవల్స్, దుప్పట్లు, పండ్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ "దేశం కోసం, ధర్మం కోసమే" జన్మించిన అజాతశత్రువుగా ప్రపంచదేశాల్లో ఖ్యాతించబడిన మన ప్రియతమా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్వాడ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. రాజకీయ నాయకుని పుట్టినరోజులు అంటే కేక్స్ కట్ చేయడం, టపాకాయలు కాల్చడం, హంగామాలు చేయడం జరుగుతుందన్నారు. కానీ నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పేదలకు ఉపయోగపడే విధంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కోలా ఆనంద్ వెల్లడించారు. ప్రతిరోజు ఒక్కొక్క ఏరియాలో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందులకు బిజెపి నేతలు అందరూ కలసికట్టుగా పనిచేస్తున్నారని కోలా ఆనంద్ తన ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్‌తోపాటు జిల్లా సెక్రెటరీ, అసెంబ్లీ పార్టీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అమ్మపాలెం రమణా రెడ్డి, మండల అధ్యక్షులు కునాటి నాగరాజు, వృద్ధుల సంక్షేమ కేంద్రం మేనేజరు సదాశివపురం కందప్పా రెడ్డి, సుబ్రమణ్యం రాజు, జ్ఞానగారి పోలయ్య, ఎన్.గోపి, సి.సుబ్రమణ్యం, మాధవ రెడ్డి, సజ్జా హరీష్, టి.చెంచు రెడ్డి, నాని, గిరిధర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పౌష్టికాహార మాసోత్సవం

విశాలాంధ్ర-పలమనేరు: పట్టణంలోని రంగాపురం అంగనవాడి కేంద్రం నందు వర్కర్ చిలకమ్మ అధ్యక్షతన పోష్టికాహార మాసోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మాసోత్సవ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా ముఖ్య అతిథిగా హాజరైనారు. సమావేశానికి మునుపు బ్యానర్ పట్టుకొని పురవీధుల్లో విద్యార్థులు స్థానిక ప్రజలతో కలిసి నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుందని అక్కడ వచ్చిన గర్భవతులు బాలింతలకు వివరించారు. ఈ మాసోత్సవ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి అంగన్వాడి కేంద్రం నందు నిర్వహించి గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పిస్తామన్నారు. అంగన్వాడి పరిధిలో ఉన్న గర్భవతులు, బాధితులు, సెంటర్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేయడం వలన మహిళల్లో రక్తహీనత పెరిగి పుట్టే బిడ్డలు బలహీనులుగా జన్మిస్తారని తెలిపారు. మహిళల్లో రక్తహీనత నివారించాలంటే విరివిగా పౌష్టికాహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నివారిస్తే పిల్లలు బలవంతులుగా ఎదుగుతారని తెలిపారు. మీ ప్రాంతాల్లో బాల వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం అనీలా మహిళల్లో రక్తహీనత, వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు మీ సమీపంలో ఉన్న ఏఎన్ఎం, లేక డాక్టర్ను సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేయడం వలన మనిషి ప్రాణానికే ప్రమాదం ఉంటుందని వివరించారు. జి ఎం ఎస్ కే నాగమణి మాట్లాడుతూ మహిళలకు ఏదైనా సమస్యలు ఉన్న ఎడల తమ దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ లత, అంగనవాడి హెల్పర్ పరిమళ, స్థానికులు, గర్భవతులు బాధితులు పాల్గొన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొట్టిడి మధు శేఖర్ రాజీనామా

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో నాటి వైకాపా నాయకులు మాజీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన కొట్టడి మధుశేఖర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టికి రాజీనామా చేస్తు శు క్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో తిరుమల లడ్డు కోసం వినియో గించే నెయ్యి సంబంధించి వస్తున్న ఆరోపణలతో ఆవేదనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తిరుమలలో ప్రసాదాల తయారీలో జరిగిన కల్తీ నెయ్యికు సంబంధించి భారతదేశంలోని హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నవని, ఈ విధానాన్ని ఏ ఒక్క హిందువు కూడా సమర్ధించడు, సహించడు, తిరుమల ప్రసాదం లడ్డు, జిలేబి, వడలకు ప్రపంచ ఖ్యాతి ఉంది విదేశాలకు వెళ్లేవారు కూడా తిరుమల ప్రసాదాన్ని ఇక్కడ నుండి తీసుకుపోయి అక్కడ మన హిందువులకు ఇచ్చే ఆనవాయితీ కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నది. ఈ ఆనవాయితీని ఇప్పటికి కూడా చాలా మంది హిందువులు పాటిస్తున్నారని తెలిపారు. ప్రసాదాలలో కల్తీ నెయ్యి కుంభకోణంలో ఎవరి పాత్ర ఉందో విచారణ జరిపించి వారందరినీ కఠినంగా శిక్షించాలని ఇప్పుడున్న కుటమి ప్రభుత్వాన్ని వెంకటేశ్వర స్వామి భక్తుడిగా కోరుకుంటున్నా నని కొట్టడి మధుశేఖర్ కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కోర్ సంస్థ ఎన్జీవో వాళ్ళు ఆధ్వర్యంలో శుక్ర వారం యర్రావారి పాళ్యం పి.హెచ్.సిలో "మీకు తెలుసా" హెచ్ఐవి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుమలత మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్‌పిలు వారి వర్కింగ్ ఏరియాలలో ఉన్న అన్ని కుటుంబాలకు హెచ్ఐవి పైన అవగాహన కల్పించండి. 18 నుండి 60 సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రతి ఒక్కరినీ హెచ్ఐవి పరీక్ష చేయించుకునేలా అవగాహన కల్పించండి అని ఆమె సూచించారు. కోర్ సంస్థ ప్రతినిధి హసీనా మాట్లాడుతూ హెచ్ఐవి ఎలా వస్తుంది వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి, కండోమ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కోర్ సంస్థ ప్రతినిధి తులసి మాట్లాడుతూ హెచ్ఐవి పైనే కాకుండా టిబి, హెచ్‌బిఎస్ఏజి, హెచ్‌సివి గురించి కూడా మన మండల పరిధిలో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సుమలత, కోర సంస్థ ప్రతినిధులు తులసి, హసీనా, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు, ఎంపిహెచ్ఓ నరసింహులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

విశాలాంధ్ర-పాకాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షు రాలు కృష్ణమనేని సావిత్రి పేర్కొన్నారు. శుక్రవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పాకాల మండలం కావలి వారి పల్లె ప్రాథమిక పాఠశాల నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో బిడ్డలను తల్లి ఎలా సంరక్షిస్తుందో అదేవిధంగా మొక్కలు సమాజంలోని మానవజాతిని రక్షిస్తాయని పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి వారి పల్లి సర్పంచ్ చంగల్ రాయులు. పంచాయతీ కార్యదర్శి బేబీ రాణి. గ్రామ రెవెన్యూ అధికారిణి లక్ష్మీ వార్డ్ మెంబర్ వేణుగోపాల్, గుణశేఖర్, రాము సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-చౌడేపల్లి: ఈనెల 21న స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా కమిటీ సభ్యులు తెలిపారు దాతలు గుంటి దశరథ రామయ్య శెట్టి గుంటి వెంకటరత్నం శెట్టి ఆధ్వర్యంలో శ్రీహిత మల్టీ స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అడ్వాన్స్ ఆనోరెక్టల్ సెంటర్ వారిచే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు అన్నారు. మెడనొప్పి వెన్నునొప్పి ఆర్థరైటిక్ నొప్పులతో బాధపడుతున్న వారు ఎముకలలో కాల్షియం లోపించి ఉన్నవారు శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించబడతాయన్నారు వీరికిరూ 2500లు విలువ చేయు పరీక్షలు పూర్తిగా ఉచితంగా వందమందికి చేయబడునని తెలిపారు. ఇక్కులూరి రూపేష్ డాక్టర్ బి.మౌనీశ్వరి లు డాక్టర్లుగా వ్యవహరిస్తారని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కాగా షుగర్ బీపీ ఉన్నవారు ఉదయం 6 గంటలకే పరీక్షలు చేయించాలని వాసవి ఆర్యవైశ్య సేవా కమిటీ సభ్యులు కోరారు.

హైయర్ పెన్షన్ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హయ్యర్ పెన్షన్ అమలులో నెలకొన్న సమస్య లు పరిష్కరించాలని సిఐటీయూ అనుబంధ ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. 1/2019 సర్కులర్ ను అమలు చేయాలని... జీవో నెంబర్ 70ను రద్దు చేయాలని కోరారు. హైయర్ పెన్షన్ వల్ల కార్మికులు అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నారని... వాటిని ఈపీఎఫ్ వో అధికారులు పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎన్వీకే రెడ్డి, జిలానీ, దేవి రాజకుమారి, మనోహరి, ఎన్ విజయలక్ష్మి సుజాత, వినీల, శారద, వజీర్, కృష్ణయ్య, శ్రీధర్, జై కుమార్, ఏలుమలై, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకం

విశాలాంధ్ర-చౌడేపల్లి: శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు శుక్రవారం లోక సుభిక్షం కోరుతూ రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. రాహుకాల అభిషేకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయాన్నే ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ గావించారు అనంతరం రాహుకాల సమయంలో రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు. పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు శుక్రవారం ఉచిత అన్న ప్రసాద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి పలమనేరుకు చెందిన నవీన్ ఉచిత అన్న ప్రసాదానికి కూరగాయలు విరాళంగా అందించారు. ఆలయ ఇఓ మరియు ఉప కార్యనిర్వాహణాధికారి ఏకాంబరం అర్చక అధికార సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిప్రోలు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట మండలం లోని గొట్టిప్రోలు గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలన వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రగతి పథం

విశాలాంధ్ర-కోట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతోనే రాష్ట్రం ప్రగతి ప్రధాన పయనిస్తుందని గూడూరు శాసనసభ్యుడు డాక్టర్ పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. కోట మండలం ఉత్తమ గ్రామంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి కావడంతో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వ తాతలకు 4000 పెన్షన్ దివ్యాంగులకు 6000, అన్నా క్యాంటీన్, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు,రైతులకు సంబంధించిన 1674 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లింపు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తూ మొదటి వంద రోజుల్లోనే ఇదిమంచి ప్రభుత్వం అనిపించుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి, మాజీ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి పలగాని భాస్కర్ రెడ్డి,తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, బీసీ సెల్ నాయకులు తీగల సురేష్ బాబు, తూపిలి రాధాకృష్ణారెడ్డి, కోకర్ల మధు యాదవ్, ఎంపీటీసీ దారా సురేష్, సీనియర్ నాయకులు పాదర్తి కోటారెడ్డి, జంగిటి కృష్ణయ్య, మర్రిపోలయ్య, మర్రి అనిల్ కందలి బాలకృష్ణ యాదవ్, పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

ప్రకృతివ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు

విశాలాంధ్ర-చిల్లకూరు: పురుగుమందుల వినియోగం లేకుండా ప్రకృతి వ్యవసాయ ప్రక్రియ ద్వారా బూదనం గ్రామ రైతు వజ్రమ్మ సాగుచేసిన కూరగాయలు అమ్మకం కేంద్రం ప్రారంభోత్సవం శుక్రవారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. గూడూరు డివిజన్ ఏడిఏ గోపినాయక్ మాట్లాడుతూ వజ్రమ్మ పండించిన కూరగాయలు శ్రేష్ఠమైనవని, వీటిని తింటే మంచి పోషకవిలువలు లభిస్తాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి భవాని మాట్లాడుతూ క్రిమిసంహారక రసాయనిక మందులు వాడకుండా సేంద్రీయ ఎరువులతో సాగు చేసిన కూరగాయల ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ మధు, సిఎన్ఏ సమన్వయకర్త క్రిష్ణ, విఏఏ మనోహర్, ఎన్ఎఫ్ఐంటి కే.తిరుమల, డియమ్ఐంటి వీరరాఘవయ్య, యూనిట్ ఇంఛార్జి కే.క్రిష్ణయ్య, ఎన్.పూర్ణిమ, సిహెచ్. ధనంజయ, వై.నారాయణమ్మ, ఐసిఆర్ పి.యమున రైతులు పాల్గొన్నారు.

పూజా సామాగ్రి దుకాణం దగ్ధం

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి హైవే రోడ్డు నాగాలమ్మ ఆలయం వద్ద రాణి, మునిక్రిష్ణారెడ్డి దంపతులు పూజా సామాగ్రి దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లారు. రాత్రి 11:45 నిమిషాలకు షాపులో మంటలు చెలరేగడంతో అటుగా వెళుతున్న హైవే మొబైల్ పోలీసులు, వినాయక స్వామి నిమజ్జనానికి తరలివెళ్తున్న యువకులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష 30 వేలు విలువైన వస్తువులు కాలి దగ్ధమయ్యాయి. చంద్రగిరి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయడం జరిగింది. ఇందులో 2. ఫ్రిడ్జ్ లు 1 ఫ్యాను, ఇతర తిను బండారాలు, కూల్ డ్రింక్స్ వగైరా ఉన్నాయి. ఈ సంఘటన ఆకతాయి యువకులు చేసుంటారని సమాచారం.

గ్రీవెన్స్ ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రమేష్ బాబు చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై ఫిర్యాదుదారులు తహశీల్దార్ కార్యక్రమంలో అర్జీలు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. వచ్చిన సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ చిత్రపటం బహూకరణ

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి పట్టణం లో అన్నా క్యాంటీన్లు పునః ప్రారంభం సందర్భంగా శుక్రవారం తొట్టంబేడు మడలం శేషమనాయుడుకండ్రిగకు చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకులు గాలి వెంకట్రామా నాయుడు ఎన్టీఆర్ చిత్రపటం బహూకరించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కు ఎన్టీఆర్ చిత్రపటాలను అందించారు. అన్నా క్యాంటీన్లో ఈ చిత్రం పటం ఉంచాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అన్నా క్యాంటీన్ను బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని.... ఆ తరువాత ఆయన తనయులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పది మందికి సేవ చేసే భాగ్యం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేట బాలాజీ రెడ్డి, మిన్నల్ రవి, వజ్రం కిషోర్, జనసేన నాయకులు కొట్టే సాయి, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-నాయుడుపేట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ తిరుపతి జిల్లా కన్వీనర్ సన్నీ అన్నారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నాయుడుపేట తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఏబీవీపీ నాయకులు స్థానిక అంబేద్కర్ భవనం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు సుమారు 200 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలత వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీ నర్ సన్నీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగా సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. అలాగే ఏబీవీపీ డిమాండ్స్ను ఆచరణలో తీసుకురావాలన్నారు. జీవో నం 77 రద్దు చెయ్యాలన్నారు. పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందన పథకాన్ని వెంటనే అమలు చేయడం తోపాటు పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్ కుమార్,ముని, సాయి, పలువురు విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు

విశాలాంధ్ర-చిట్టమూరు: మండలస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు బాలబాలికలకు అరవపాలెం నల్లారెడ్డి బాలకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల నందు 23వ తారీకు నుండి నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బివి కృష్ణయ్య మరియు మండల స్థాయి ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్ భరత్ మహిపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో 14 సంవత్సరముల నుండి 17 సంవత్సరములు వరకు వయసు కలిగిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందని ఈ ఆటల పోటీలలో వాలీబాల్, కబడ్డీ, యోగ, కోకో, బ్యాట్మింటన్, చెస్ మరియు అథ్లెటిక్స్ క్రీడలలో పోటీలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని ఈ క్రీడలలో ఎంపికైన వారు నియోజకవర్గ పోటీలలో పాల్గొంటారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్లు సురేష్, నరేంద్ర, ధనుంజయ, శ్రీధర్, సుజాత, స్వాతి, షణ్ముఖ మొదలగు వారు పాల్గొన్నారు.

ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది ఓవరాక్షన్.. మామిడి చెట్లు నరికివేత

విశాలాంధ్ర-రామచంద్రాపురం: మండలంలోని తిమ్మరాజు పల్లిలో మామిడి చెట్లను ఏపీ ట్రాన్స్కో సిబ్బంది ఓవరాక్షన్ తో నరికివేసినట్లు ఓ మహిళ రైతు నూతలపాటి జ్యోతి ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఎస్ఈ సురేందర్ నాయుడుకి ఫిర్యాదు చేశారు. విలేకరుల సమావేశంలో మహిళా రైతు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. తిమ్మరాజు పల్లిలో తమకు ఉన్న రెండు ఎకరాల పొలంలో మామిడి చెట్లు ఉన్నాయని సదరు మామిడి చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది ఇన్స్పెక్టర్ త్రివిక్రమ రావు రాయలచెరువు సబ్ ఇంజనీర్ మరియు ఇన్చార్జి ఏఈ రామ్మూర్తి ఆదేశాల మేరకు సిబ్బందిని తీసుకొని వచ్చి తమకు తెలియకనే నరికి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ ఇంచార్జ్ రామ్మూర్తికి విషయం తెలిపినా ఎలాంటి న్యాయం చేయలేదని తెలియజేశారు. తమ మామిడి చెట్లు విద్యుత్ లైన్ లకు దూరంగా ఉండినా తమ అనుమతి లేకనే నరకడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయని రైతులుగా తాము ఎంతో నష్టపోతున్నామని వివరించారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకుని వెళ్లామని, మహిళా రైతుకు తగిన న్యాయం చేయమని ఎమ్మెల్యే ఆయన ఆదేశించిన విద్యుత్ శాఖను ఆదేశించినట్లు చెప్పారు. తమ మామిడి చెట్లు నరికివేత పైన న్యాయం చేయకపోతే తాము చట్టపరంగా ప్రైవేటు కేసు ఫైల్ చేయడానికి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇకనైనా అధికారులు తమకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోగలరని లేదంటే చట్టపరంగా తాము ప్రైవేట్ కేసు వేయనున్నట్లు చెప్పారు.

'ఇది మంచి ప్రభుత్వం'ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరిచేందుకు చేపట్టిన చేపట్టనున్న ఇది మంచి ప్రభుత్వం అనే పేరుతో గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామిలు కోరారు ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నూరు రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామాలలో సభలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అదే విధంగా నూతనంగా ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజలకు క్లుప్తంగా వివరించాలని సూచించారు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా ప్రతి ఒక్క పథకం ప్రజలకు చేరవేయడంలో టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డి, సీతాపతి, చలపతి, చిన్నిక్రిష్ణ, రామకృష్ణప్ప, మహమ్మద్ రఫీ, ఆదిల్ బాషా, మనోహర్, మరియు ఎంపీడీవో ఈశ్వరన్, తహసిల్దార్ బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన వేనాటి సతీష్ రెడ్డి

విశాలాంధ్రు-సూళ్లూరుపేట: చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని శుక్రవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్,ఆర్టిజి, మానవ వనరుల శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ను తిరుపతి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి రేణిగుంట విమానాశ్రయంలో కలసి సాదర వీడ్కోలు పలికారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-ఓజిలి: విద్యార్థులు అటు చదువులో ఇటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందనివిద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదతాయని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో క్రీడాకారులు పాల్గొనాలని క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. శుక్రవారం ఓజిలి మండల కేంద్రములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ హరిబాబు ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను ఎంపీడీవో రజనీకాంత్, ఎంఈఓ శైలజా, ఎంఈఓ 2.చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల చేతుల మీదుగా క్రీడ పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎగరేసి జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు.

సూడో ఎమ్మెల్యేలపై పోరాటాలకు సిద్ధం కావాలి

రుయా హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి : రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు

విశాలాంధ్ర - తిరుపతి : జిల్లాలో పెట్టలేకపోతున్న చూడు ఎమ్మెల్యేలపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు పిలుపునిచ్చారు శుక్రవారం తిరుపతి రుయా హాస్పిటల్‌లో సిపిఐ శాఖ సమావేశం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పాలన ప్రజా అనుకూలంగా లేనందు వల్లే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి పూటమే ప్రభుత్వానికి అధికారం ఇస్తే నేడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అతనికి తీసుకోకుండా పాలన చేస్తూ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటే నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని ఫ్రీ సిలిండర్లని ప్రగల్భాల్ పనికి వందరోజుల పాలన ఆర్భాటమే తప్ప ఆచరణలో ఏమాత్రం కనిపించలేదని ఆయన సేవ చేశారు రాష్ట్రంలో పెన్షన్ మాత్రం పెంచాడే తప్ప కొత్త ఉద్యోగాల కల్పన గాని ఉద్యోగస్తులకు జీతాల పెంపుదల గాని అధిక ధరలు తగ్గించడం కానీ ఖాళీగా ఉన్న టిట్కో ఇళ్లలో లబ్ధిదారులను చేర్పించడంలో గాని చొరవ చూపించక పోవడం అత్యంత బాధాకరం అన్నారు చిన్న చిన్న కారు రైతులకు బ్యాంకు రుణాలు ఎందుకు రద్దు చేయలేదు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు తిరుపతి జిల్లాలో ప్రధానంగా గెలిచిన ఎమ్మెల్యేలు కాకుండా చూడు ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతుందని ఒక్కో నియోజకవర్గానికి 50 మంది స్టూడియో ఎమ్మెల్యేల పెరిగిపోయారని దీనివల్ల ప్రజాస్వామ్యం లేకుండా శాంతిభద్రతల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన సూచించారు అలాగే ప్రశ్నించి పనిచేసే గ్రీన్ అంబాసిడర్ ఆశా మధ్యాహ్న భోజనం అంగన్వాడీ వర్కర్లు ఇతర హౌస్ కీపింగ్ వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా నెలల కాలం కాలయాపన చేస్తూ కార్మికుల పొట్టలు కొడుతున్నారని అదేవిధంగా అధికార పార్టీ నాయకులు అన్ని మండల స్థాయి అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని వాళ్ళని బెదిరిస్తూ భయాందోళన గురిచేస్తూ అధికారులను కూడా సక్రమంగా పని చేయలేని పరిస్థితి ఈ రాష్ట్రంలో రాబోతున్నదని వాపోయారు తిరుపతి రుయా హాస్పిటల్ లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారికి భద్రత లేకపోవడం కాంట్రాక్టు నిర్లక్ష్య వైఖరికి ఆసుపత్రి యాజమాన్యం వత్తాసు పలకడం అత్యంత బాధాకరమన్నారు తక్షణ మే ఏ వన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరివి రొయ్య ఆసుపత్రి సిబ్బంది జోక్యం చేసుకొని కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని లేకుంటే అందరినీ కలుపుకొని పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు ఈ సమావేశానికి ముందు గా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ కుమార్తె కే యమున పుట్టినరోజు సందర్భంగా సెక్యూరిటీ గార్డ్ ఘనంగా కేక్ కట్ చేసే శుభాకాంక్షలు తెలియజేస్తూ 500 మంది పైగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కె రాధాకృష్ణ నగర కార్యదర్శి జయ విశ్వనాథ్ జిల్లా సమితి సభ్యులు వై యస్ మణి, శాఖ కార్యదర్శి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిఐఐ "సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్''అందుకున్న శ్రీసిటీ సీఎఫ్ఓ

విశాలాంధ్ర- సత్యవేడు: శ్రీసిటీని మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది.కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంస్థ వారి "సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్" శ్రీసిటీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఆర్.నాగరాజన్ కు దక్కింది.గురువారం బెంగుళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సిఐఐ సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్ కార్యక్రమంలో ఈ అవార్డును అందచేశారు.సిఐఐ మాజీ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ చైర్మన్ క్రిస్ గోపాలకృష్ణన్, సిఐఐ సిఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023-2024 చైర్మన్,భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. మౌళిక వసతుల కల్పన రంగంలో ఆర్థిక నిపుణుడుగా తాను చూపిన అసాధారణమైన ప్రతిభ,కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది.సీఎఫ్ఓకు అభినందనలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి,ఈ ప్రతిష్టాత్మిక అవార్డు గెలుచుకోవడం తమకు చాలా గర్వంగా వుందన్నారు. ఆర్థికరంగ నిపుణులను ప్రోత్సహిస్తూ ఏటా అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిఐఐ సంస్థను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ పురస్కారంలో భాగంగా ట్రోఫీ మరియు ప్రశంసాపత్రం అందచేశారు. ప్రస్తుత ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు గతంలో పలు అవార్డులను నాగరాజన్ అందుకు న్నారు. 2022లో సీఎఫ్ఓ ఇండియా సంస్థ నుండి సీఎఫ్ఓ-100 అవార్డు, 2021లో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నుండి 'బెస్ట్ సిఎంఏ సీఎఫ్ఓ' అవార్డు, 2021లో ఆసియా సీఎఫ్ఓ లీడర్‌షిప్ అవార్డులలో 'సీఎఫ్ఓ ఆఫ్ ది ఇయర్' గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.

మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతోనే మానవ మనుగడ సాధ్యమని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వైకుంఠపురం స్వాగతతోరణం పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త కుప్పలను తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని అన్నారు. మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షిస్తేనే భావితరాలకు మనం మంచి వాతావరణాన్ని అందించిన వారమవుతామని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : చిత్తూరు జిల్లా బంగారుపాళ్యెం పర్యటన నిమిత్తం రేణిగుంటకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్ బాబుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి ఘన స్వాగతం పలికారు. గురువారం జాతీయ తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు బంగారు పాల్యం పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌బాబుకు నాయకులతో కలిసి విమానాశ్రయం లాంజిలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.

డయాలసిస్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి లోకేష్

విశాలాంధ్ర -చిత్తూరు : బంగారుపాళ్యెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ను శుక్రవారం రాష్ట్ర మానవ వనరులు, ఐటి, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ న ప్రారంభించారు. దీని తో పాటు రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను, నూతనంగా నిర్మించిన ఔట్ పేషెంట్ విభాగం ను ప్రారంభించారు డయాలసిస్ పేషంట్లతో మంత్రి మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసు కుంటున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద రావు,సెకండరీ హెల్త్ డైరెక్టర్ సిరి,జిల్లా కలెక్టర్ సుమిత కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జే సి జి. విద్యాధరి,ఎం ఎల్ సి కంచర్ల శ్రీకాంత్,పూతలపట్టు, పలమనేరు,నగరి,చంద్రగిరి శాసన సభ్యులు కె.మురళి మోహన్,ఎన్.అమరనాథ్ రెడ్డి,జి. భాను ప్రకాష్, పులివర్తి నాని,అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువగళం జ్ఞాపకాలను మరచిపోని యువనేత లోకేష్

- మురుగన్ టీ స్టాల్‌లో చాయ్ తాగి నాటి స్మృతులను నెమరు వేసుకున్న మంత్రి లోకేష్

విశాలాంధ్ర - చంద్రగిరి: రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ఘట్టాలను నమోదు చేసిన చారిత్రాత్మక యువగళం నాటి అనుభవాలను యువనేత నారా లోకేష్ మర్చిపోలేదు. మంత్రిగా చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన లోకేష్ అనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బంగారు పాళ్యం పర్యటన ముగించుకొని తిరిగి రేణిగుంట ఎయిర్ పోర్టుకు వెళుతున్నప్పుడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. యువగళం పాదయాత్ర సాగే సమయంలో గాదంకి టోల్ గేట్ వద్దకు చేరుకున్నప్పుడు లోకేష్ అక్కడ ఆగి టీ తాగారు. శుక్రవారం నాడు కాన్వాయ్ గాదంకి టోల్గేట్ వద్దకు చేరుకున్నప్పుడు ఈ విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రి లోకేష్ కు గుర్తుచేశారు. వెంటనే కాన్వాయ్ ని ఆపిన మంత్రి లోకేష్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్ కు చెందిన మురుగన్ టీ స్టాల్ లోకి వెళ్లారు. కార్యకర్తలతో కలిసి చాయ్ తాగి యువగళం నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కుశల ప్రశ్నలు వేశారు. బిజీ షెడ్యూల్లో సైతం దాదాపు అర్ధగంట పాటు అక్కడి కార్యకర్తల కోసం కేటాయించడంతో వారు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన తరల్ జిల్లా కోఆర్డినేటర్

విశాలాంధ్ర - తడ : మండల పరిధిలోని పూడి ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణను జిల్లా తరల్ కో ఆర్డినేటర్ సునీల్ శర్మ మరియు విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ రావులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, పనితీరును తనిఖీలలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనంను రుచి చూసి విద్యార్థులకు అందించే భోజనము రుచితో పాటు సూచి శుభ్రతతో వండి విద్యార్థులకు అందించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు భోజనం వడ్డించే ముందు ప్రతి ఒక్క విద్యార్థి చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పరిశుభ్ర వాతావరణ లో భోజనం వడ్డించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.

వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయ నిధికి

ఇసిఎల్ రూ.25 లక్షలు విరాళం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాష్ట్రంలో కురిసిన అధిక వర్షాల కారణంగా నష్టపోయిన విజయవాడ తదితర ప్రాంతాల వరద బాధితుల సహాయార్థం ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్(ఇసిఎల్) కంపెనీ, శ్రీకాళహస్తి తరపున ఎండీ సురేష్ ఖండేల్వాల్ 25 లక్షల రూపాయల చెక్కును విరాళంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్,ఆర్టీజీ, మానవ వనరుల శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి రేణిగుంట విమానాశ్రయం నందు శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తో కలిసి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్(ఇసిఎల్) కంపెనీ, శ్రీకాళహస్తి తరపున ఎండీ సురేష్ ఖండేల్వాల్ అందజేశారు